


షాపింగ్‌మాల్‌లో కిక్కిరిసిన జనం

పంద్రాగస్టు పరేషాన్!

- అధికారులకు జనసమీకరణ టార్గెట్
- స్వాతంత్ర్య వేడుకల వేదిక మార్పుతో ఆదేశాలు
- ఇంకా చిత్తడిగానే పోలీస్ పరేడ్ గ్రౌండ్!
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హైమావతి


బురదమయంగా పరేడ్ గ్రౌండ్

సిద్దిపేట ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కేరాఫ్‌గా ఉన్న పట్టణం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం ఈ ఏడాది వేడుకలకు దూరం కావడంతో మూగబోయింది. జిల్లాఏర్పడిన నాటి నుంచి కరోనా సమయంలో మినహా మొత్తం వేడుకలను ఈ మైదానంలోనే నిర్వహించారు. ఈ ఏడాది మాత్రం పట్టణానికి దూరంగా ఉన్న పోలీస్ కమిషనరేట్ లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు.

సమీకరణకు టార్గెట్..

వందల సంఖ్యలో విద్యార్థులతో పాటు ప్రజలను వేడుకలకు తీసుకొచ్చేందుకు పలువురు అధికారులకు ఉన్నతాధికారులు టార్గెట్లు విధించినట్లు తెలిసింది. జిల్లా విద్యాశాఖాదికారితో పాటు పలువురు అధికారులకు సైతం ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో సిద్దిపేటకు దూరంగా ఉన్న పరేడ్ గ్రౌండ్‌కు పలు వాహనాల్లో విద్యార్థులను తరలించే ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. వర్షం కురిస్తే పరిస్థితి ఏంటని అధికారులు గుసగుసలాడుకుంటున్నారు. వేదిక మార్పుపై పట్టణవాసులు మండిపడుతున్నారు.

బురదమయంగా పరేడ్ గ్రౌండ్

రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పరేడ్ గ్రౌండ్ బురదమయంగా మారింది. దీంతో పోలీస్ పరేడ్‌కు, సాంస్కృతిక కార్యక్రమాలకు అనుకూలంగా ఉండేందుకు కార్మికులతో బురద ఉన్నచోట చిన్న కంకర రాళ్లను వేయనున్నారు. వేడుకలకు హాజరయ్యే వారి కోసం కుర్చీలు, షామీయానాలు సిద్ధం చేశారు.

ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం

నేడు ఉదయం మంత్రి పొన్నం ప్రభాకర్ జాతీయ జెండాను ఎగురవేసి జిల్లా అభివృద్ధిపై సుదీర్ఘ సందేశాన్ని ఇవ్వనున్నారు. అందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. శకటాల

మిగతా 8వ పేజీలో


పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

అనసూయ సందడి

చేర్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : చేర్యాలలో గురువారం సినీనటి అనసూయ సందడి చేశారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినీ ఫేం బుల్లిరాజుతో కలిసి ఆమె హాజరయ్యారు. చేర్యాలలో ఏర్పాటు చేసిన శుభవర షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారు. బుల్లిరాజుతో పాటు తాను నటించిన చిత్రాల పాటలకు డ్యాన్స్ చేసి ఆకట్టుకున్నారు. షాపింగ్ మాల్ ప్రారంభం సందర్భంగా బంఫర్ ఆఫర్ ప్రకటించడంతో పట్టణంతో పాటు పొరుగు గ్రామాల నుంచి వినియోగదారులు అధికసంఖ్యలో తరలిరావడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో షాపింగ్‌మాల్ యజమాని సూర్యకాంత్ గాంధీ, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.




డ్యాన్స్ చేస్తున్న అనసూయ

రైతన్నలకు రంది..!

- గజ్వేల్‌లో యూరియా కొరత
- రేక్ వస్తే తప్ప సరఫరా లేని పరిస్థితి
- దిగుబడిపై ప్రభావం

గజ్వేల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్ర యూరియా కొరత ఏర్పడింది. ప్రస్తుతం ఆయా పంటలకు యూరియా వేయాల్సిన సమయం. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలకు యూరియా వేస్తే పెరుగుదల బాగుంటుందని రైతులు భావిస్తున్నారు. అయితే, పట్టణంలో కిలో యూరియా కూడా అందుబాటులో లేకపోవడంతో రైతులు కంటి మీద కునుకు లేకుండా ఆందోళన చెందుతున్నారు. వారం, పది రోజులుగా గజ్వేల్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయం, ఎరువుల దుకాణాల వద్దకు పెద్ద సంఖ్యలో రైతులు వస్తున్నారు.

> విస్తారంగా కురుస్తున్న వర్షాలు రైతులకు ఆనందాన్ని ఇస్తున్నప్పటికీ, యూరియా కొరత మాత్రం అన్నదాతలను కలవరపెడుతోంది. గజ్వేల్ నియోజకవర్గంలో యూరియా స్టాక్ సున్నాకు పడిపోవడంతో రైతులు దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు.

డిమాండ్ భారీగా ఉండటం, మార్కెట్లో యూరియా లభించకపోవడంతో వ్యవసాయ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని టోకెన్లు జారీ చేస్తున్నారు. కేవలం ఎకరాకు రెండు బ్యాగులు మాత్రమే ఇస్తున్న అధికారులు, రేపటి నుంచి ఒకటి కూడా ఇచ్చే పరిస్థితి లేదని చెబుతున్నారు. గజ్వేల్ రేక్ పాయింట్‌కు యూరియా వస్తే తప్ప సమస్య పరిష్కారం అయ్యేలా కనిపించడం లేదు. అయితే, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని మూసాపేట రేక్ పాయింట్ నుంచి యూరియాను తీసుకువచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు లక్షా 80వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం భారీ డిమాండ్ ఉన్నప్పటికీ, కేవలం ఒక లారీ (500బ్యాగులు) మాత్రమే అందుబాటులోకి రానుందని తెలియడంతో రైతులు, అధికారులు ఆందోళన చెందుతున్నారు. నానో యూరియాపై

మిగతా 8వ పేజీలో


దుబ్బాక : సరిపడా యూరియాను అందించాలని గురువారం దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో ధర్నా చేస్తున్న రైతులు


G Kishan Reddy @kishanreddybjp · 7h
Rail Connectivity To Komuravelli Mallanna Temple Soon

Railway Halt Station

Status Update: 95% Completed

The new halt station at Komuravelli village in Siddipet Dist., Telangana is nearing completion.

On completion, it will ensure seamless connectivity for pilgrims visiting Komuravelli Mallanna Temple, particularly those from Hyderabad, and boost local connectivity in the region.

ఎక్స్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పోస్ట్

త్వరలోనే రైల్వే హాల్ట్‌స్టేషన్ ప్రారంభం

- ఎక్స్‌లో పోస్టు చేసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కొమురవెల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి సమీపంలో నిర్మించిన రైల్వేహాల్ట్‌స్టేషన్ పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గురువారం తన ఎక్స్ ఖాతాలో నిర్మాణం పూర్తైన ఫొటోలతో పోస్టుచేశారు. ఈ హాల్ట్‌స్టేషన్ నిర్మాణంతో జంట నగరాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు మల్లికార్జునస్వామి ఆలయానికి సులభంగా చేరుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక బీజేపీ నేతలు రైల్వేహాల్ట్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించి "ధన్యవాద్ మోదీజీ" అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు స్వరూప, నాయకులు దండ్యాల లక్ష్మారెడ్డి, నర్ర మహేందర్ రెడ్డి, కొయ్యడ నవీన్, బోడుగం కృష్ణారెడ్డి, ఎక్కలదేవి శ్రీనివాస్, గొల్లపల్లి మల్లికార్జున్, బుడిగె బాలమణి పలువురు పాల్గొన్నారు.

అన్ని వసతులు కల్పిస్తాం

- త్వరలో కాలేజీ భవన నిర్మాణానికి సీఎంతో శంకుస్థాపన
- ఫోన్‌లో విద్యార్థులతో మంత్రి పొన్నం ప్రభాకర్
- కాలేజీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తున్నాం : కలెక్టర్ హైమావతి

హుస్నాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లో ప్రారంభమైన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఏ లోటు రాకుండా అన్ని వసతులు కల్పిస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. గురువారం ఆయన హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమంలో ఫోన్‌లో మాట్లాడారు. ఇక్కడ ప్రభుత్వ కాలేజీ ప్రారంభం కావడంతో తన గుండెల నిండా సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకే ఇంజనీరింగ్ కాలేజీ తీసుకొచ్చామన్నారు. మొదటి బ్యాచ్ మీదే, మీరే ఈ కళాశాల అంబాసిడర్లని, దీనికి మంచి గుర్తింపు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. 35 ఎకరాల విస్తీర్ణంలో కాలేజీ నూతన భవనం నిర్మాణం చేస్తున్నామని, త్వరలో దీనికి సీఎం రేవంత్‌రెడ్డితో శంకుస్థాపన చేయిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఈ కాలేజీలో చదివే బాయ్స్, గర్ల్స్‌కు వేర్వేరుగా హాస్టల్ వసతి కల్పిస్తున్నామన్నారు. బాగా చదువుకొని ఈ ప్రాంతానికి గుర్తింపు తీసుకరావాలని సూచించారు. శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేశ్‌కుమార్ మాట్లాడుతూ క్లాస్ రూమ్స్, ప్రాక్టికల్ గదులు, అన్ని సౌకర్యాలు వస్తున్నాయన్నారు. ఉత్తమ అధ్యాపకులను రప్పించే బాధ్యత తనదని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, బంక చందు, కాలేజీ ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి తదితరులున్నారు.


విద్యార్థినితో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మొక్కజొన్నకు 'కత్తెర' కాటు 7
- పురుగు నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

దేవుడా.. నా అప్పులు తీర్చు 7
- హుండీలో భక్తుడి వింత కోర్కెలు

టాస్క్‌ఫోర్స్ వల

- అక్రమ దందాలపై ఉక్కుపాదం
- ఏడునెలల్లో 145 కేసులు, 544 మంది అరెస్టు
- కేసుల నమోదులో రాష్ట్రంలో జిల్లా 10వ స్థానం

సిద్దిపేటలో అక్రమ దందాలకు అడ్డుకట్ట పడనుంది. ఇప్పటికే ఇసుక అక్రమ రవాణా, రేషన్ బియ్యం, నిషేధిత గుట్కా, గంజాయి, బెల్ట్‌షాపులు, పేకాట క్లబ్‌లు, వ్యభిచార గృహాలను కూడా మూసివేస్తూ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దూసుకుపోతున్నారు. కేవలం ఏడునెలల్లోనే 145 కేసులు నమోదు చేసి 544 మందిని అరెస్ట్ చేశారు. దీంతో అక్రమ కార్యకలాపాల నివారణలో రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా 10వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జూన్‌లో తెలంగాణ యాంటి నార్కోటిక్స్ బ్యూరో వారు రివార్డు అందజేశారు. ప్రజలు ఇస్తున్న సమాచారం ఆధారంగా దాడులు నిర్వహిస్తూ, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతూ దాడులను మరింత ముమ్మరం చేశారు.

సిద్దిపేట క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కమిషనరేట్ పరిధిలోని టాస్క్‌ఫోర్స్ రెండు బృందాలుగా పనిచేస్తోంది. సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ విభాగం కార్యాలయం ఉంది. పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ పర్యవేక్షణలో సీఐలు శ్రీధర్, రమేష్‌తో పాటు మొత్తం 13 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ రెండు బృందాలు సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ డివిజన్‌లలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయి.

అక్రమ దందాలపై నిఘా..

ఏడు నెలల్లో అక్రమ దందాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి అక్రమ రేషన్ బియ్యం రవాణాకు సంబంధించి 31 కేసులు నమోదు చేశారు. 33 మందిని అరెస్టు చేశారు. వారి నుండి 682 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి 44 కేసులు నమోదు చేసి 94 మందిని అరెస్టు చేసి 1241 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. పేకాట కేసుల్లో 39 కేసులు నమోదు


అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసిన పోలీసులు (ఫైల్)

మిగతా 8వ పేజీలో

లాభాలు చూపించి రూ.39.5 లక్షలు టోకరా

పటాన్‌చెరు ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ వ్యాపారం చేసుకుంటున్న ఓ యువకుడు రూ.39.5లక్షలు మోసపోయాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వినాయకరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన ప్రదీప్ అనే వ్యక్తి ఆన్‌లైన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 16న ఫోన్‌లో వచ్చిన లింక్‌ను తెరిచి యాప్‌ను తెరిచాడు. దానిలో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుడు పెడితే అధిక లాభాలు వస్తాయని ఉంది. దీంతో ఖాతా తెరిచి, అందులో రూ.50వేలు వేశాడు. అదే రోజు రూ.4వేలు లాభం చూపించారు. 4వేలు నుంచి 16వందల రూపాయలు ఖాతా నుంచి డ్రా చేశాడు. అంతా సక్రమంగానే ఉందనుకున్నాడు. అనంతరం రూ.2.25లక్షలు ఆన్‌లైన్ ఖాతాలో వేశాడు. వీటికి రూ.4లక్షలు లాభం చూపించారు. అనంతరం రూ.24లక్షలు కట్టి సభ్యత్వం తీసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఇందుకు తగ్గట్టుగా 24లక్షలు ఆన్‌లైన్ ఖాతాలో వేశాడు. దీనికి రూ.1.34కోట్లు లాభం చూపించారు. దీనిలోంచి రూ.45లక్షలు డ్రాచేయబోతుండగా 15శాతం ఆదాయపు పన్నుకింద రూ.6.75లక్షలు కట్టాలని కోరారు. ఇందుకు తగ్గట్టుగా మొత్తం ఆన్‌లైన్‌ఖాతాలో జమచేశాడు. మరో రూ.3లక్షలు కట్టాలంటూ కోరడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఐటీ ఉద్యోగినికి రూ.19.99లక్షలకు టోపీ

ఇంటి వద్దే ఉంటూ డబ్బులు సంపాదించవచ్చు అని వచ్చిన ప్రకటన చూసి ఐటీ ఉద్యోగిని మోసపోయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వినాయకరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చుగూడ గ్రామానికి చెందిన ఓ ఐటి ఉద్యోగిని ఫోన్‌కు పార్ట్‌టైం జాబ్ పేరుతో ఎస్ఎంఎస్ లింక్ వచ్చింది. పెట్టుబడి పెడితే లాభాలు అర్జించవచ్చంటూ నమ్మబలికారు. దీంతో గత నెల 16న లింక్ తెరిచి రూ.52,365లు ఆన్‌లైన్ ఖాతాలో వేసింది. రూ.40వేలు, 50వేలు దఫాలుగా వేశారు. రూ.1,83,799లు వేశారు. దీనికి రూ.రెండు లక్షలు లాభం చూపించడంతో రెట్టించిన ఉత్సాహంతో మరిన్ని డబ్బులు వేయాలంటూ వారు చెప్పడంతో రూ.19,99లక్షలు వేసింది. వాటిని డ్రా చేయబోగా రావడంలేదు. అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

24 గంటల్లో దోపిడీ కేసు ఛేదన

● నిందితుడి అరెస్ట్

మెదక్ అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ అటవీ ప్రాంతంలోని దోపిడీ ఘటనను పోలీసులు.. 24 గంటల్లోనే ఛేదించారు. పాత నేరస్థుడిని అరెస్టు చేసి.. అతడి నుంచి ఆభరణాలను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. హావేళీఘణపూర్ మండల పరిధిలోని మదుల్వాయి గ్రామానికి చెందిన గజ్జల బిక్షపతి ఈ నెల 13న బస్సులో ప్రయాణిస్తూ ఓ మహిళతో పరిచయం చేసుకున్నాడు. అదేరోజు సాయంత్రం 5 గంటల సమయంలో నర్సాపూర్ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి, మహిళను నమ్మించి మద్యం తాగించి, మత్తులోకి జారుకున్న తర్వాత ఆమెపై దాడి చేసి బంగారు చెవి కమ్మలు దోచుకెళ్లాడు.

బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి దర్యాప్తు ప్రారంభించారు. మద్యం దుకాణంలోని సీసీ ఫుటేజ్ ఆధారాలను, నిందితుడు ధరించి దుస్తుల ఆనవాళ్ళ గుర్తించిన పోలీసులు కీలకమైన సమాచారాన్ని సేకరించారు.

గురువారం నిందితుడిని గుమ్మడిదలలో అరెస్టు చేసి.. దొంగలించిన అభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. దోపిడీ కేసును ఛేదించిన తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగంను ఎస్పీ, అదనపు ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

పాత నేరస్థుడే

బిక్షపతి గతంలో పలు నేరాల్లో అరెస్టు అయ్యాడు. మొదటి భార్యకు విడాకులు ఇచ్చి, మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకొని, రెండో భార్యతో గుమ్మడిదలలో నివసిస్తున్నాడు. మద్యం, జూదం, వంటి వ్యసనాలకు బానిసై విలాసవంతమైన జీవనశైలికి అలవాటు పడి ఖర్చుల కోసం నేరాలకు పాల్పడ్డాడు.

2015లో మెదక్ పట్టణంలో దొంగతనం కేసులో మొదటి సారి అరెస్టయ్యాడు. నిందితుడిపై మెదక్ టౌన్‌లో 5 కేసులు, గుమ్మడిదల టౌన్‌లో 2, అల్వాల్, హత్నూర, నారాయణఖేడ్‌లో 1 చొప్పున కేసులు నమోదయ్యాయి. మెదక్ టౌన్‌లో పోక్స్ కేసు కూడా నమోదైనట్లు ఎస్పీ తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో ప్రధానోపాధ్యాయుడి మృతి


శ్రీనివాస్(ఫైల్)

గజ్వేల్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రధానోపాధ్యాయుడు గురువారం మృతి చెందాడు. గజ్వేల్ మండలం జాలిగామ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌కి కొన్ని రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ శ్రీనివాస్ గురువారం మృతి చెందాడు. శ్రీనివాస్ సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గజ్వేల్‌లో ఉంటున్నాడు.

విద్యుదాఘాతంతో వ్యక్తి ..

పాపన్నపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బోరుబావి వద్ద స్టార్టర్ రిపేర్ చేస్తుండగా, విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం మండల పరిధిలోని కందిపల్లిలో జరిగింది. బాధిత వర్గాల కథనం ప్రకారం.. కందిపల్లి గ్రామానికి చెందిన టేక్మాల్ విఠల్ (42)కూలీ పనులతో పాటు, బోర్ల మరమ్మతులు చేస్తూ, జీవనం కొనసాగిస్తున్నాడు. గ్రామానికి చెందిన ఓ రైతు బోరు మోటరు పనిచేయకపోవడంతో, అతడి కోరిక మేరకు రిపేర్ కోసం వెళ్లాడు. కాగా స్టార్టర్ బాక్సు విద్యుత్ ప్రసారం కావడంతో, దాన్ని ముట్టగానే, కరెంటు షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే రైతులు, అతడిని మెదక్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే విఠల్ మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. మృతుడికి భార్య దుర్గమ్మ, కుమారుడు ఉన్నారు. పాపన్నపేట ఎస్సైని వివరణ కోరగా, విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

హత్యా! ఆత్మహత్యా?

● అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియుని వ్యక్తి

కుకునూరుపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): లకుడారం గ్రామ శివారులోని కల్పన వెంచర్‌లో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ మృతి హత్యనా ఆత్మహత్యనా అనేది అనుమానాస్పదంగా ఉంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉండవచ్చని, లకుడారం శివారులో నిర్మించిన వెంచర్‌లో చెట్టుకు ఓ వ్యక్తి ఉరి వేసుకున్నాడని వెంచర్ సూపర్‌వైజర్ ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా ఒక వస్త్రంతో చిన్న చెట్టుకి ఉరివేసుకొని ఉన్నాడని, అతని వద్ద ఏ వివరాలు లభించలేదని అనుమానాస్పద మృతిగానే కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఐదు అడుగుల చెట్టుకి ఉరి వేసుకొని ఆత్మహత్యకి పాల్పడతారా అనే అనుమానం కలుగుతుంది. ఎవరో ఆ వ్యక్తిని చంపి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లుగా తెలుస్తోంది. మర్మాంగాలపై బలంగా కొట్టినట్లు స్థానికులు తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

కంగ్టి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజారాం తండా శివారులో గురువారం సాయంత్రం మహిళ మృతదేహం లభ్యమైంది. నారాయణఖేడ్ - కంగ్టి ప్రధాన రహదారికి పక్కనే రాజారా తండా చౌరస్తాకు కిలో మీటర్ దూరంలో వ్యవసాయ క్షేత్రంలోని ఓ షెడ్డులో మహిళ మృతదేహం ఉన్నట్లు మేకల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్సై దుర్గారెడ్డి తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు తుర్కవడగాంకు చెందిన నర్సమ్మ(40)గా గుర్తించారు. మృతురాలి శరీరంపై వస్త్రాలు లేకుండా బండరాయితో మోదిన ఆనవాళ్లు కనిపించడంతో అనుమానాలు తలెత్తి క్లూస్ టీంకు సమాచారం అందించారు. మహిళ మృతిపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

గేదెను ఢీ కొన్న ద్విచక్రవాహనం

● ఇరువురికి తీవ్రగాయాలు

మద్దూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారు గేదెను ఢీ కొనడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. మద్దూరు నుంచి చేర్యాలకు వెళ్లే దారిలోని కల్వర్టు సమీపంలోని మూలమలుపులో అడ్డుగా వచ్చిన గేదెను ఢీ కొన్న ఘటనలో చేర్యాల మండలంలో జరిగింది. ఈ క్రమంలో వేచరేణికి చెందిన ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. మద్దూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వివాహానికి హాజరైన నర్సింహులు, మరోవ్యక్తి తిరిగి వస్తుండగా కల్వర్టు సమీపంలోని మూలమలుపులో గేదె అడ్డుగా రావడంతో ప్రమాదవశాత్తు ఢీ కొట్టారు. దీంతో కిందపడ్డ ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించగా ప్రథమచికిత్స అనంతరం చేర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

161 జాతీయ రహదారిపైనా ఫాస్టాగ్ వార్షిక పాస్

- రూ.3 వేలతో ఏడాదంతా 200 ట్రిప్పులకు చెల్లుబాటు
- 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్‌తో సులభమైన సేవలు
- నేటి నుంచి అందుబాటులోకి..



161 జాతీయ రహదారిపై తాడ్దానిపల్లి వద్ద టోల్‌ప్లాజా

పుల్‌కల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ప్రయాణించే వారి కోసం ఫాస్టాగ్ వార్షిక పాస్ నేటి నుంచి అందుబాటులోకి వచ్చింది. రూ.3000 చెల్లించి ఏడాది మొత్తం 200 ట్రిప్పులు తిరిగేందుకు ఈ పాస్ చెల్లుబాటు అవుతుంది. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) దీనికోసం ప్రత్యేకంగా రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను ప్రవేశపెట్టింది. సంగారెడ్డి - నాందేడ్ ఎన్ఎన్ఏ 161 జాతీయ రహదారిపై కూడా ఈ యాప్ సేవలను పొందవచ్చు. చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే, ఈ వార్షిక పాస్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు వర్తించదని ఎన్‌హెచ్‌ఏఐ స్పష్టం చేసింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు వాహనదారులను కోరుతున్నారు.

సెంట్రల్ జైలులోకి మొబైల్ ఫోన్లు నిషేధం

- జైళ్ల శాఖ ఉత్తర్వులు జారీ

కంది, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి సెంట్రల్ జైలు లోపలికి మొబైల్ ఫోన్లను నిషేధిస్తూ జైళ్ల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. జైలును సందర్శించే రాజకీయ నాయకులు, వీఐపీలు, అలాగే జైలు సూపరింటెండెంట్, జైలర్లు, ఇతర సిబ్బంది ఎవరూ సెల్ ఫోన్లను లోపలికి తీసుకెళ్లరాదు. జైలు ప్రధాన గేటు వద్దే ఫోన్లను ఉంచాల్సి ఉంటుంది. భద్రత దృష్ట్యా, జైలు లోపల ఫొటోలు, వీడియోలు తీయడం కూడా నిషేధించారు. ఈ చర్యలు జైలు లోపలి విషయాలు బయటకు రాకుండా ఉండేందుకు తోడ్పడతాయని అధికారులు తెలిపారు.

సంగారెడ్డి జైలులో న్యాయ సేవాధికార సంస్థ తనిఖీ

- ఖైదీలకు అందుతున్న సదుపాయాలపై ఆరా


జైలు వద్ద న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, కోర్టు, జైలు సిబ్బంది

కంది, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి సెంట్రల్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ తనిఖీ జరిగింది. ఖైదీలకు బెయిల్, ములాఖత్‌లు సకాలంలో అందుతున్నాయా అని ఆమె అడిగి తెలుసుకున్నారు. జైలులోని బ్యారక్‌లు, వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించి, ఖైదీల భోజనాన్ని రుచి చూశారు. ఖైదీలకు ఉచిత న్యాయవాదులను నియమిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. అవసరమైన సదుపాయాలు కల్పించాలని జైలు సూపరింటెండెంట్ కళాసాగర్‌కు ఆమె సూచించారు.

అట్టహాసంగా అండర్-18 బాస్కెట్‌బాల్ పోటీలు

- ప్రతిభ కనబర్చిన 73 మంది క్రీడాకారుల ఎంపిక


బాస్కెట్‌బాల్ క్రీడారులతో టీబీఏ, వోక్సెన్ యూనవర్సిటీ ప్రతినిధులు

మునిపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ గ్రామ శివారులోని వోక్సెన్ యూనివర్సిటీలో అండర్- 18 బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరంలో, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ట్రయల్స్‌లో ప్రతిభ చూపిన 49 మంది బాలురు, 24 మంది బాలికలు ఎంపికయ్యారు. ఈ శిబిరంలో ఎంపికైన క్రీడాకారులు 75వ జూనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పృథ్వీశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 30 వరకు కొనసాగుతాయని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా వోక్సెన్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రౌట్ వి.రోడ్రిగేజ్, హెడ్ ఆఫ్ స్పోర్ట్స్ విశాల్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అత్యుత్తమ ప్రతిభావంతులను గుర్తించి, అభివృద్ధి చేసేందుకు ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఆల్ కబీర్ పరిశ్రమ మూసివేయాలని డిమాండ్

ఈడీ అభియోగపత్రాన్ని పరిగణలోకి తీసుకున్న పీఎంఎల్ఏ కోర్టు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని ఆల్ కబీర్ పరిశ్రమపై ఈడీ దాఖలు చేసిన అభియోగపత్రాన్ని హైదరాబాద్‌లోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు పరిగణలోకి తీసుకోవడంతో, ఈ పరిశ్రమను మూసివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పశుమాంసం వ్యర్థాలను శుద్ధి చేయకుండా బయట పారవేయడంతో పరిసరాల్లోని నీరు, వాతావరణం కలుషితమయ్యాయని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. వ్యర్థాల శుద్ధి చేయకపోవడం ద్వారా కంపెనీ రూ.61 లక్షలు అక్రమంగా కూడబెట్టుకుందని దర్యాప్తులో తేలింది. ఈ పరిశ్రమ వల్ల వాయు కాలుష్యం తీవ్రంగా పెరిగిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమను మూసివేయాలని గతంలో బీజేపీతో పాటు, స్థానికులు పలు ఆందోళనలు చేసినా ఫలితం లేకపోయింది. 2017లో పీసీబీ చర్యలకు ఉపక్రమించగా, ఈడీ కంపెనీ ఫిక్స్‌డ్ డిపాజిట్లను జప్తు చేసింది. తాజాగా కోర్టు అభియోగపత్రాన్ని పరిగణలోకి తీసుకోవడంతో, పరిశ్రమను శాశ్వతంగా మూసివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు

వైద్యుల సకాల స్పందనతో తల్లీబిడ్డలు క్షేమం


సన్‌రైజ్ ఆస్పత్రిలో ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు ఆడ శిశువులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలానికి చెందిన మాచెపల్లి సభ బేగం, సమీయుద్దీన్ దంపతులకు ఒకే కాన్పులో ముగ్గురు ఆడ శిశువులు జన్మించారు. బుధవారం రాత్రి హఠాత్తుగా పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు ఆమెను సంగారెడ్డిలోని సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు మల్లిక, కృష్ణలు తక్షణమే స్పందించి సీజేరియన్ ఆపరేషన్ నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున ముగ్గురు శిశువులు జన్మించారని వైద్యులు తెలిపారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఒక్కొక్క శిశువు 1.68 కిలోల బరువుతో జన్మించారని చెప్పారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ తల్లీబిడ్డలను సురక్షితంగా కాపాడిన వైద్యులకు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తమ ఆసుపత్రి ఎటువంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటుందని సన్‌రైజ్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ పి.స్వామిగౌడ్ తెలిపారు.

పప్పులతో మువ్వన్నెల జెండా



79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, గజ్వేల్‌కు చెందిన రామకోటి రామరాజు తన దేశభక్తిని వినూత్నంగా చాటుకున్నారు. మూడు రకాల పప్పు ధాన్యాలను ఉపయోగించి 10 అడుగుల పొడవుతో మువ్వన్నెల జెండాను తీర్చిదిద్దారు.
- గజ్వేల్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి)

తిరంగా ర్యాలీ



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం దుబ్బాకలో భారీ తిరంగా ర్యాలీని నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులు, నాయకులు ప్రధాన వీధుల్లో జాతీయ జెండాతో ప్రదర్శనగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- దుబ్బాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి)

మొక్కజొన్నకు కత్తెర కాటు

పురుగు నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి



కొండపాక మండలం బందారంలో మొక్కజొన్నకు సోకిన కత్తెర పురుగు

కొండపాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పలు గ్రామాల్లో మొక్కజొన్న పంటకు 'కత్తెర' పురుగు ఆవహించింది. వాతావరణ మార్పులు, కాలానుగుణ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. ఈ పురుగు పంట పెరుగుదలను నిలిపివేయడంతో పాటు, దిగుబడిని కూడా తగ్గిస్తుంది. దీన్ని సకాలంలో గుర్తించి, నివారణ చర్యలు తీసుకుంటే పంటలను కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

కత్తెర పురుగు లక్షణాలు

- ఆకులు కోసినట్లుగా కనిపిస్తాయి. ఆకుల మీద గుళికల రూపంలో గుడ్లు ఉంటాయి.
- పిల్ల పురుగులు సమూహంగా కదలి, ఆకులను పూర్తిగా తినేస్తాయి.
- పంట పెరుగుదల ఆగిపోతుంది.

నివారణ చర్యలు

- ఈ పురుగు గడ్డి మొక్కల ద్వారా వ్యాపిస్తుంది. దీని నివారణకు అంతర కృషి ద్వారా పొలం గట్లపై ఉన్న గడ్డిని, మునుపటి పంటల అవశేషాలను పూర్తిగా తొలగించాలి.
- లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేప నూనె కలిపి పిచికారీ చేయాలి. జీవ క్రిమినాశకాలను కూడా వాడవచ్చు. పురుగు తీవ్రతను బట్టి రసాయనిక మందులను పిచికారీ చేయాలి.
- క్వినాల్‌ఫాస్ 25 ఈసీని లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి
- క్లోరిపైరిఫాస్ 20 ఈసీ లీటరు నీటికి 2.5 మిల్లీలీటర్లు కలిపి, 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను తొలి దశలో పంటకు పిచికారీ చేయాలి.
- స్పైనోసాడ్‌ను లీటరు నీటికి 0.3 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి.

దేవుడా.. నా అప్పులు తీర్చు

- హుండీలో భక్తుడి వింత కోరికలు


భక్తుడి కోరికలతో రాసిన నోట్

కొడిపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆలయ హుండీలో సాధారణంగా భక్తులు డబ్బులు, బంగారం, వెండి వంటివి వేస్తుంటారు. కానీ మెదక్ జిల్లా కొడిపల్లిలోని తునికి నల్లపోచమ్మ ఆలయంలో ఓ భక్తుడు తన కోరికలు రాసిన చిన్న నోట్‌బుక్‌ను సమర్పించాడు. గురువారం హుండీ లెక్కింపు సందర్భంగా ఈ వింత విషయం వెలుగులోకి వచ్చింది. ఆ నోట్‌బుక్‌లో ఆ భక్తుడు తనకు ఉన్న రూ.20 లక్షల అప్పులు, భూ సమస్య, చెల్లి పెళ్లి, మంచి ఉద్యోగం వంటి కోరికలను ఏకరువు పెట్టి, వాటిని 21 రోజుల్లో తీర్చాలని రాశాడు. నాలుగు నెలల 18 రోజుల తర్వాత నిర్వహించిన ఈ హుండీ లెక్కింపులో ఆలయానికి రూ.7,43,345 ఆదాయం లభించింది. గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అమ్మవారిని దర్శనం చేసుకుని పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంతో కదిలిన యంత్రాంగం

చిల్వర్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు చర్యలు

ప్రమాదాల నివారణకు అధికారులు హామీ


చిల్వర్ వద్ద ప్రమాదస్థలిని పరిశీలిస్తున్న సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్, పోలీసులు

అల్లాదుర్గం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని 161వ జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలపై అధికారులు స్పందించారు. ఈనెల 13న చిల్వర్ బస్‌స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై ప్రజల ఆందోళనతో అధికార యంత్రాంగం కదిలింది. అండర్ బ్రిడ్జి నుంచి మందాపూర్ వెళ్లే రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం జరిగిన ప్రమాదం తర్వాత స్థానికులు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకుని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. దీంతో గురువారం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐ శంకర్.. జాతీయ రహదారి అధికారులను చిల్వర్ గ్రామానికి పిలిపించారు. గ్రామస్థులు, అధికారులు ప్రమాదాల గురించి చర్చించి, చిల్వర్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేస్తాం: సంగారెడ్డి ఆర్టీసీ డీఎం

చిల్వర్ వద్ద జరిగిన ప్రమాదంపై సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బస్ డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చిల్వర్-మందాపూర్ గ్రామాల ప్రయాణికులకు ఇది ప్రధాన బస్టాండ్ అయినప్పటికీ, ఆర్టీసీ బస్సులు ఇక్కడ ఆగకుండా వేగంగా వెళ్లిపోతున్నాయని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీనిపై స్పందించిన డీఎం ఉపేందర్.. చిల్వర్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆగేలా చర్యలు తీసుకుంటామని, ఇక్కడ రిక్వెస్ట్ బస్‌స్టాప్ కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థుల ధర్నాకు స్పందించిన ఆర్టీసీ అధికారులు


చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆగిన బస్సు

చేగుంట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో ఎక్కించుకోవడం లేదంటూ విద్యార్థులు చేసిన ధర్నాకు అధికారులు స్పందించారు. సిద్దిపేట ఆర్టీసీ డీఎం రఘు ఆదేశాల మేరకు గురువారం చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బస్సు ఆపి విద్యార్థులను ఎక్కించుకున్నారు. కళాశాల సమయానికి అనుగుణంగా బస్సు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశైలంకు ప్రత్యేక బస్సు

నారాయణఖేడ్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం నారాయణఖేడ్ నుంచి శ్రీశైలంకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ బస్సును నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. ఈ నెల 17న ఉదయం 8 గంటలకు మంగల్‌పేట బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరి శ్రీశైలం చేరుకుంటుందని తెలిపారు. ఒక్కొక్కరికి రానుపోను చార్జీ రూ. 1700 మాత్రమేనని, ఆసక్తి ఉన్నవారు 9959223170, 9441071134, 9676667703 నంబర్లను సంప్రదించాలని కోరారు. 30 మంది ప్రయాణికులు ఉంటే ఎక్కడి నుంచి అయినా బస్సును పంపుతామని డీఎం పేర్కొన్నారు.

విద్యారంగాన్ని నీరుగారుస్తున్న ప్రభుత్వాలు

- సిద్దిపేట జిల్లా మహాసభను జయప్రదం చేయాలి
- యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి


గజ్వేల్‌లో మాట్లాడుతున్న రవి

గజ్వేల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నీరుగారుస్తున్నాయని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి విమర్శించారు. గజ్వేల్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంపై బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గిస్తున్నారని, ప్రైవేటీకరణకు ప్రోత్సాహం ఇస్తున్నారని అన్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో గజ్వేల్‌లో జరిగే యూఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభల్లో విద్య వ్యతిరేక విధానాలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు కొండపాక సివిల్ ఇంజనీర్ ఎంపిక


అవార్డుకు ఎంపికైన రమ్య శ్రీ

కొండపాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం సిరసనగండ్ల గ్రామానికి చెందిన సివిల్ ఇంజనీర్ రమ్యశ్రీ నేషనల్ ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్ డిజైన్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 21న బెంగళూరులో జరిగే కాన్ఫరెన్స్‌లో ఆమె అవార్డును అందుకోనున్నారు. హైదరాబాద్‌లో డిజైనెస్ట్ ఇంటీరియర్స్ కంపెనీని స్థాపించిన రమ్యశ్రీ, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు డిజైన్లను రూపొందిస్తున్నారు. రెసిడెన్షియల్ ప్రాజెక్టుల కేటగిరీలో ఆమెకు 'ట్రెండ్‌సెట్టర్, ప్రామిసింగ్ ఇంటీరియర్ డిజైన్ ఫర్మ్ ఆఫ్ ది ఇయర్ 2025' అవార్డు లభించింది. ఈ గుర్తింపు పట్ల రమ్యశ్రీ సంతోషం వ్యక్తం చేశారు.


మనోహరాబాద్ మండలం కొండాపూర్‌లో పారిశ్రామిక వాడలోని పరిశ్రమలు

కార్మికుల ప్రాణాలతో చెలగాటం

పరిశ్రమల నిర్లక్ష్యంపై ఆందోళన

ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా పట్టించుకోని అధికారులు

మనోహరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా మనోహరాబాద్ ప్రాంతం పరిశ్రమలకు కేంద్రంగా మారింది. మండలంలో సుమారు 200 చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో పని చేసేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కార్మికులు వలస వస్తున్నారు. పొట్టకూటి కోసం వచ్చే ఈ కార్మికుల ప్రాణాలకు ఇక్కడ భద్రత కరువైంది. పరిశ్రమల యజమాన్యాలు కార్మికులకు సరైన రక్షణ కల్పించకుండానే నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ గంటల పాటు ప్రమాదకరమైన పనులు చేయిస్తున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. అయినప్పటికీ, సంబంధిత అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) ఈ సమస్యను పట్టించుకోవడం లేదు.

టీజీఐఐసీ అనుమతులకే పరిమితం

తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేస్తోంది. కానీ, ఆ తర్వాత పరిశ్రమల్లో భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని పర్యవేక్షించడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప అధికారులు ఆవైపు చూడడం లేదు. పరిశ్రమల్లోని 90 శాతం మంది వలస కార్మికులే కావడంతో యాజమాన్యాలు మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

పరిహారంలోనూ అన్యాయం

ప్రమాదాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు సరైన నష్టపరిహారం అందడం లేదు. వలస కార్మికులు కాబట్టి వారి కుటుంబాలు ఇక్కడికి రాలేవు. దీన్ని ఆసరాగా తీసుకుని యాజమాన్యాలు తక్కువ పరిహారంతో చేతులు దులుపుకుంటున్నాయి. పరిశ్రమల యాజమాన్యాలు మధ్యవర్తుల (కాంట్రాక్ట్ సోర్స్) ద్వారా కార్మికులను నియమించుకుని, ప్రమాదం జరిగినప్పుడు వారి కుటుంబాలను బెదిరిస్తున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తోటి కార్మికులు మాట్లాడేందుకు కూడా భయపడుతున్నారు.

పలు ప్రమాద ఘటనలు

- కాళ్లకల్ జాతీయ రహదారిపై ఉన్న రామ స్పిన్నింగ్ మిల్‌లో గత శనివారం గోడ కూలి కార్మికుడు తమ్మారెడ్డి బాల్‌రెడ్డి(56) మరణించాడు. మరో కార్మికుడు గానుగ రవి(43) కాలు కోల్పోయాడు. వారికి తూతూమంత్రంగా పరిహారం ఇచ్చి యాజమాన్యం చేతులు దులుపుకుంది.
- కొండాపూర్ టీజీఐఐసీ పారిశ్రామిక వాడలోని శ్రీయాన్ పాలిమార్ పరిశ్రమలో ఏప్రిల్‌లో విద్యుత్‌షాక్‌తో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రఘునాథ్‌సింగ్ (21) మృతి చెందాడు. గతంలోనూ ఈ పరిశ్రమలో ఇలాంటి ఘటనలు జరిగాయని కార్మికులు చెబుతున్నారు.
- రంగాయపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలో 35 రోజుల వ్యవధిలో ఇద్దరు వలస కార్మికులు చనిపోయారు. ఇటీవల కాళ్లకల్‌లోని మహాలక్ష్మి స్టీల్ పరిశ్రమలో పైపులు మీదపడి ఒకరు మరణించారు.
- ఈ నెల 5న కూచారం శ్రీయన్ ల్యాబ్ లిమిటెడ్ పరిశ్రమలో గ్యాస్ లీకేజీ వల్ల ఎనిమిది మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.

అగ్నిమాపక కేంద్రం లేక ప్రాణనష్టం

వందల సంఖ్యలో పరిశ్రమలు ఉన్నప్పటికీ, తూప్రాన్ ఉమ్మడి మండలంలో ఒక్క అగ్నిమాపక కేంద్రం కూడా లేదు. ప్రమాదం జరిగితే నర్సాపూర్ నుంచి ఫైర్ ఇంజన్ రావడానికి సమయం పడుతుంది. ఈ జాప్యంతో ప్రాణ, ఆస్తి నష్టం తీవ్రమవుతోంది. చాలా పరిశ్రమలు కనీస నిబంధనలు పాటించడం లేదు. అనుమతులు లేకుండా కల్తీ పదార్థాలు తయారు చేసే పరిశ్రమలు కూడా ఉన్నాయి.

పదోతరగతి టాపర్లకు నగదు పురస్కారం

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం విద్యాశాఖ ఇచ్చే నగదు ప్రోత్సాహకాలకు సిద్దిపేట ఇందిరానగర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. తెలంగాణ ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్లుగా నిలిచిన ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలకు 10వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందించి సన్మానిస్తుంది. ఈ జాబితాలో ఇందిరానగర్ స్కూల్‌కు చెందిన ఎం.డి. ఆయాన్, బి. శివకుమార్ జిల్లా టాపర్లుగా నిలిచి పురస్కారానికి ఎంపికయ్యారు. వారు ఈ పురస్కారాన్ని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో అందుకోనున్నారు. ఈ సందర్భంగా అర్బన్ మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

న్యూట్రీ హబ్‌ను సందర్శించిన హుస్నాబాద్ విద్యార్థులు

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం కృషి కల్ప ఎన్జీవో సహకారంతో హైదరాబాద్ లోని జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్‌డీ) న్యూట్రీ హబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్ఐఆర్‌డీ శాస్త్రవేత్తలు తేనెటీగల పెంపకం, వర్మి కంపోస్ట్, అగ్రి టెక్నాలజీ ఉత్పత్తుల పరిశోధనల గురించి విద్యార్థులకు వివరించారు. న్యూట్రీ హబ్‌లో వివిధ రకాల మిల్లెట్స్, పుట్టగొడుగుల పెంపకం వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి, కాలేజీ ఈడీసీ సెల్ కన్వీనర్ ఇందిరా నాయనా దేవి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మద్దూరు ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

మద్దూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నిజాం కాలంలో నిర్మించిన మద్దూరు ఉన్నత పాఠశాల పునరుద్ధరణకు పూర్వ విద్యార్థులు సహాయం అందించారు. 2000-21 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ వంతుగా పాఠశాల అభివృద్ధికి రూ.22,616 ఎంఈవో వరదరాజు ద్వారా ఉపాధ్యాయులకు అందజేశారు. పాఠశాల పూర్వ వైభవాన్ని పునరుద్ధరిస్తున్న ఉపాధ్యాయులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ

అక్కన్నపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులతోనే కూరగాయల పంటలను సాగు చేయాలని లోడి సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం. బాలశౌరి అన్నారు. గురువారం అక్కన్నపేట మండలంలోని పలు గిరిజన తండాల్లో రైతులకు ఉచితంగా కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు.



బీజేపీ ఓట్ చోరీ చేసిందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు గజ్వేల్ పట్టణంలో గురువారం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. - గజ్వేల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి)



మద్దూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ర్యాలీ

అట్టహాసంగా తిరంగా

సిద్దిపేట కల్చరల్ /మద్దూరు/గజ్వేల్/అక్కన్నపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. జి. సునీత కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది జాతీయ పతాకంతో సెల్ఫీలు తీసుకుని హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని సర్టిఫికెట్లు పొందారు. అలాగే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్వేత అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సువర్ణదేవి నేతృత్వంలో విద్యార్థినులు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం ర్యాలీ నిర్వహించారు. మద్దూరు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'తిరంగా ర్యాలీ' నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా నుంచి బసవేశ్వర విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పాల్గొని మాట్లాడారు. అక్కన్నపేట మండల కేంద్రంలో మాజీ సైనికులు కరివేద సంజీవరెడ్డి, పంజా సదానందం, వినోద్‌లను బీజేపీ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.



గజ్వేల్ పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



సిద్దిపేట కల్చరల్ : గోపిక, చిన్ని కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

హుస్నాబాద్/సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలోని కృష్ణవేణి మాంటిస్సోరి హైస్కూల్, సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సెలిస్టియల్ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషాధారణలతో, ఉట్టి కొట్టే కార్యక్రమాలతో అలరించారు. ఆయా కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ : గోపిక, చిన్ని కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు

రైతులకు యూరియాను అందించాలి

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



రైతులతో కలసి ధర్నా నిర్వహిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియాను సక్రమంగా అందించాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ప్యాక్స్ కార్యాలయం వద్ద రైతులు యూరియా కోసం ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఆయన, వారికి సంఘీభావం తెలిపి అనంతరం ఇందిరా పార్కు చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు గజ్వేల్ రేక్ పాయింట్‌కు యూరియాను అందించకపోతే, రాజీవ్ రహదారిని దిగ్బంధం చేసి వంటావార్పు చేపడతామని హెచ్చరించారు. ఆయనతో మాజీ జెడ్పీటీసీ పంగ మల్లేశం, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, బెండే మధు, పాల రమేశ్‌గౌడ్, నవాజ్‌మీరా, దయాకర్‌రెడ్డి, శ్రీధర్, దుర్గాప్రసాద్, కళ్యాణ్‌కర్ నర్సింగరావు, కళ్యాణ్‌కర్ శ్రీనివాస్, ఉమర్ తదితరులు ఉన్నారు.

సేవాభావం ఎంతో గొప్పది

- డీఈవో ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేట రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సేవాభావం ఎంతో గొప్పదని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ బృందం సహకారంతో విద్యార్థులకు రూ.లక్ష విలువైన షూస్, సాక్స్, బెల్టులు, ఐడీ కార్డులు పంపిణీ చేశారు.

ఘన నివాళి

అక్కన్నపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వారోత్సవాలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తెలంగాణ గౌడ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మార్క అనిల్ గౌడ్ తదితరులు నివాళులర్పించారు.

ఐటీఐతో త్వరగా ఉపాధి

- సీపీ అనురాధ

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పూర్తయిన తర్వాత ఐటీఐ చేయడం వల్ల త్వరగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లోని కోర్సుల వివరాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఐటీఐ కాలేజ్ ప్రిన్సిపల్ రామానుజ, కుకునూరుపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటరమణ, కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగడిబజారులో వరదనీటి మళ్లింపు



కందకం తీయిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగేందర్

చేర్యాల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వరద నీరు నిలవకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. చిన్నపాటి వర్షం కురిసినా అంగడిబజారు క్రాస్‌రోడ్డులో వరదనీరు నిలిచి కుంటలా మారుతోంది. ఈ సమస్యపై 'వరద నీటిలో సంత' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద డ్రైనేజీ వరకు కందకం తీసి వరదనీటిని మళ్లించారు. అయితే, ఇది తాత్కాలిక పనులేనని, శాశ్వత ప్రాతిపదికన వరదనీటి మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగదేవ్‌పూర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న జి. దుర్గేష్, బి. అభిషేక్ అనే ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్‌16టీవీ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన పోటీలలో వారు అత్యుత్తమ క్రీడా ప్రదర్శనను కనబరిచారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన దుర్గేష్, అభిషేక్‌లను పాఠశాల హెచ్.ఎం. అనసూయ, పీడీ రాజిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

23వ వార్డులో వనమహోత్సవం.. మొక్కల పంపిణీ



వార్డులో మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో వనమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానిక కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్ సూచించారు. నాటిన మొక్కలను జాగ్రత్తగా కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ సాయిరెడ్డి, ఆర్పీ లావణ్య, అంగన్‌వాడీ టీచర్ వనిత, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరం

గజ్వేల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మైనర్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమని, చట్టరీత్యా నేరమని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై, ట్రాఫిక్ నియమ నిబంధనలపై, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సాధించడానికి కృషి చేయాలని ఆయన సూచించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండి, అవసరమైన మేరకు మాత్రమే దానిని ఉపయోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి యెలగందుల కృష్ణ, షీ టీమ్ సభ్యులు రాంచంద్రారెడ్డి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



పంద్రాగస్టు పరేషాన్!

(5వ పేజీ తరువాయి)

ప్రదర్శన సంబంధించి ఆయా శాఖల అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం అధికారులతో కలిసి కలెక్టర్ హైమావతి పరిశీలించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి విచ్చేసే మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర వీఐపీలు, అధికారులు, మీడియా తదితరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. జాతీయ సమైక్యత ప్రతిబింబించేలా కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

'టాస్క్‌ఫోర్స్' వల

(5వ పేజీ తరువాయి)

చేసి 352 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ7.82 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు సంబంధించి 16 కేసులు నమోదు చేసి 38 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 3.07 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఇక కల్తీ విత్తనాల కేసులో ఒక కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. 275 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపులపై దాడులు చేసి ఐదు కేసులు నమోదు చేశారు. అలాగే వ్యభిచార గృహాలపై దాడులు చేసి రెండు కేసులు నమోదు చేసి 11 మందిని అరెస్ట్ చేశారు.

అక్రమ దందాలకు పాల్పడితే చర్యలు



అక్రమ దందాలకు పాల్పడేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు డయల్ 100 లేదా టాస్క్‌ఫోర్స్ నంబర్లు 8712667446, 8712667447 సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతాం

- అనురాధ, సీపీ

రైతన్నలకు రంది..!

(5వ పేజీ తరువాయి)

అధికారులు అవగాహన కల్పించినప్పటికీ, రైతులు తక్షణమై అటువైపు మళ్లడం కష్టమని భావిస్తున్నారు. ఈ నెల చివరి వరకు యూరియాకు డిమాండ్ ఎక్కువగా ఉండటం తో, ప్రభుత్వం వెంటనే స్పందించి యూరియాను అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి



ప్రస్తుతం టోకెన్లతో ఎకరాకు రెండు యూరియా బస్తాలు ఇస్తున్నారు. శుక్రవారం నుంచి కేవలం ఒక్క లారీ మాత్రమే అందుబాటులోకి వస్తుందని తెలిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు అందుబాటులో యూరియాను ఉంచాలి.

- సందబోయిన ఎల్లయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

సెట్విన్‌లో రాయితీపై నైపుణ్య శిక్షణ

గజ్వేల్ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు సెట్విన్ ద్వారా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉపాధి నైపుణ్య శిక్షణను అందిస్తున్నట్లు సెట్విన్ ఇన్‌చార్జి ఎం.ఎ. ఖదీర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, గజ్వేల్ పట్టణంలోని కోటమైసమ్మ దేవాలయం సమీపంలో గల సెట్విన్ కేంద్రంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన యువతకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. టీచర్ ట్రైనింగ్ (పీపీటీసీ), ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, మహిళలకు కుట్టు మిషన్, మగ్గం వర్క్, మెహందీ, బ్యూటీషియన్, యువతకు ఫ్రిజ్, ఏసీ రిపేర్, ఎలక్ట్రీషియన్, సీసీటీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ రుసుముపై 25 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు, ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు సోమవారం నుంచి స్వీకరిస్తారని, మరిన్ని వివరాలకు 8790810172 నెంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

18న స్పాట్ అడ్మిషన్లు

చేర్యాల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా పరిధిలోని చేర్యాల, వర్గల్, కొండపాక, చిన్నకోడూరు, అల్వాల్, దుబ్బాక, కోహెడ, హుస్నాబాద్ బాలికల పాఠశాలలు, అలాగే ములుగు, జగదేవ్‌పూర్, గజ్వేల్, సిద్దిపేట రూరల్, రామక్కపేట, మిట్టపల్లి, తొగుట, బెజ్జంకి బాలుర గురుకుల కళాశాలలు/పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఐదవ తరగతితో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీట్ల భర్తీకి ఈనెల 18న చేర్యాల గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయ అధికారి పోలోజు నర్సింహాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జాతీయస్థాయి సేవా పురస్కారం అందుకున్న శేరి బాలనారాయణ

చేర్యాల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు శేరి బాలనారాయణ జాతీయస్థాయి సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఇటీవల హైదరాబాద్ లోని మనం ఫౌండేషన్ వివిధ రంగాలలో సేవా దృక్పథంతో రాణిస్తున్న వారిని గుర్తించిన నేపథ్యంలో శేరి బాలనారాయణను ఎంపిక చేశారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు ఆయనకు ప్రశంసాపత్రం, మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య మహాసభ నాయకులు, కిరాణా వర్తక సంఘం నాయకులు ఆయనను అభినందించారు.

నలుగురికి జరిమానా

సిద్దిపేట క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ తన సిబ్బందితో కలిసి సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, రాజీవ్ రహదారిపై వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో నలుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వారిని గురువారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా, విచారణ అనంతరం నలుగురికి రూ.5వేల విధించి, వారిలో ఒకరికి మూడు రోజులు జైలు శిక్ష విధించారు.